
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అనంతపురం
జిల్లా వార్తలు
5
గురువారం 12 సెప్టెంబరు 2024



సప్తగిరి సర్కిల్‌లో వినాయకుడి శోభాయాత్ర.. పాల్గొన్న భక్తజన సందోహం



ఆదివారం వరకూ ఆడండి ప్లీజ్..!



అనంతలో దులీప్ ట్రోఫీ అనగానే యువత సంబర పడిపోయింది. దేశానికి ప్రాతినిధ్యం వహించే తమ అభిమాన ఆటగాళ్లను నేరుగా చూడొచ్చని, వారి ఆటను ఆస్వాదించవచ్చని ఎగిరి గంతేసింది. కానీ అందరూ అన్ని రోజుల్లో మైదానానికి వెళ్లి ఆట చూడ లేరు కదా..? అందుకే ఆదివారం వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. తంటాలు పడి పాస్‌లు చేజిక్కించుకున్నారు. కానీ ఏం చేస్తారు పాపం..? మొదటి ఆట మూడు రోజుల్లో ముగిసింది. రెండో ఆట గురువారం నుంచి మొదలవుతోంది. ఈసారి కూడా ఆదివారం నాలుగో రోజే వస్తోంది. ఇదైనా నాలుగు రోజుల పాటు కొనసాగాలని క్రికెట్ లవర్స్ కోరుకుంటున్నారు. బ్యాట్స్‌మెన్ గట్టిగా నిలబడితేనే 'ఆదివారం' ప్రేక్షకుల కోరిక తీరుతుంది. లేదంటే మళ్లీ నిరాశే..! 'భయ్యా.. వికెట్లకు కాస్త దూరంగా బాల్స్ వేయండి.. ఎలాగైనా నాలుగోరోజు దాకా ఆట మిగిలేలా చూడండి..' అని బౌలర్స్‌ను అడగలేం కదా..! కాబట్టి.. మొదటి మూడు రోజులు గ్రౌండ్‌కు వెళ్లే వారు 'ఎలాగైనా నిలబడండి.. బౌలర్స్‌తో తలపడండి..' అని బ్యాట్స్‌మెన్‌ను ఎంకరేజ్ చేయండి..! ఆదివారం వరకూ..! ప్లీజ్..!

- అనంతపురం క్లాక్ టవర్

7లో

నాటు తుపాకీ కేసులో ముగ్గురి అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్, ఎస్ఐ

రామగిరి, సెప్టెంబరు 11: సుద్దకుంటపల్లిలో నాటు తుపాకితో హల్‌చల్ చేసిన వ్యవహారంలో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ఘటన వివరాలను రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ బుధవారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన చెన్నకేశవ, గంగాధర్ సమీప బంధువుల. గంగాధర్ భార్య పేరిట ఉన్న ఇంటిని అమ్మగా వచ్చిన రూ.1.25 లక్షలతో ఇద్దరూ అక్రమ మద్యం వ్యాపారం చేసే వారు. దీనిపై గతంలో రామగిరి పోలీస్‌స్టేషన్‌లో చెన్నకేశవపై కేసు నమోదైంది. బయట ఉన్న గంగాధర్.. బెయిల్ ఇప్పిస్తానని చెప్పి చెన్నకేశవను మోసగించాడు. అప్పటి నుంచి వీరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. చెన్నకేశవ భార్య సాయిలీలను లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు రావడంతో రామగిరి పోలీస్‌స్టేషన్‌లో మార్చిలో గంగాధర్‌పై కేసు నమోదైంది. గంగాధర్, చెన్నకేశవ్ గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, దందాలు చేసేవారు. ఆయుధం ఉంటే ఇలాంటివి బాగా చేయవచ్చని భావించి.. ధర్మవరానికి చెందిన ఆనంద్‌తో రూ.1.50 లక్షలకు నాటు తుపాకీని కొనుగోలు చేశారు. ఆనంద్ గతంలో మూడున్నర సంవత్సరాలు ఉజ్జయిని జైలులో శిక్ష అనుభవించారు. జైల్లో ఉన్నప్పుడు తనకు పరిచయమైన వారి నుంచి ఆనంద్ తుపాకీ ఇప్పించాడు. అదే తుపాకీతో చెన్నకేశవను గంగాధర్ మంగళవారం బెదిరించాడు. దీంతో చెన్నకేశవ బంధువులు గణేశ్, లింగమయ్య తుపాకీని లాక్కున్నారు. పోలీసులు గ్రామానికి వెళ్లి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. గొడవపడిన చెన్నకేశవ, గంగాధర్‌తోపాటు తుపాకీ అమ్మిన ఆనంద్‌ను అరెస్టు చేశారు.

నిమజ్జన శోభ









యువతలో ఉప్పొంగిన ఉత్సాహం
గంగ ఒడికి చేరిన స్వామివారి విగ్రహాలు

అనంతపురం నగరంలో ఐదురోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరారు. అంతకు మునుపు మండపాల వద్ద పెద్దఎత్తున అన్నదానం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సప్తగిరి సర్కిల్‌లోని వినాయక్ చౌక్ వరకూ శోభాయాత్రలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి దారిపొడవునా భక్తులు బారులు తీరారు. ఆకట్టుకునే వేషధారణలతో రంగులు చల్లుకుంటూ యువత ఉత్సాహంగా వేడుకలలో పాల్గొంది. వినాయక్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ముగింపు సభకు ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎస్పీ జగదీష్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్సవాల ముగింపు సూచికగా ధ్వజావరోహణం చేశారు. నగరంలో వెయ్యికి పైగా విగ్రహాలను నిమజ్జనం జరుగుతోందని, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ప్రపంచానికి శాంతి నేర్పడమే హిందూ తత్త్వమని విజయాదిత్య అన్నారు. అందరినీ కలుపుకుపోవడమే హిందుత్వమని, వాడవాడలా జరిగే వినాయకచవితి వేడుకలు దీనికి నిదర్శనమని అన్నారు. సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రతిబింబాలు పండుగలు అని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. అనంతరం బాణసంచా పేల్చి, భక్తిగీతాలాపనలతో గణనాథుని శోభాయాత్రను ప్రారంభించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మాజీ మేయర్ స్వరూప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఉత్సవ సమితి కార్యాధ్యక్షుడు పరుచూరి రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.





లడ్డూ రూ.2.04 లక్షలు

సప్తగిరి సర్కిల్ వినాయక మండపం వద్ద స్వామివారి లడ్డూను నగరానికి చెందిన చిల్లా రామేశ్వర్‌రెడ్డి వేలంలో రూ.2.04 లక్షలకు దక్కించుకున్నారు. ఆయన వరుసగా మూడో ఏడాది స్వామివారి లడ్డూను దక్కించుకోవడం విశేషం. గత ఏడాది రూ.44వేలు పలికిన లడ్డూ, ఈ ఏడాది ఏకంగా రూ.2.04 లక్షలు పలికింది. పోటీలో సుమారు 20 మంది పాల్గొన్నారు. ఉత్సవ సమితి నిర్వాహకులు రామేశ్వర్‌రెడ్డికి లడ్డూతోపాటు స్వామివారి శేషవస్త్రం అందజేసి సత్కరించారు. - అనంతపురం కల్చరల్



బడికి వెళ్లాక.. సెలవు

- విస్తుగొలిపేలా విద్యాశాఖ తీరు
- ఉపాధ్యాయులతో తల్లిదండ్రుల వాగ్వాదం
- నిమజ్జనోత్సవానికి సెలవు.. ఆనవాయితీ
- ఆ విషయం అధికారులకు తెలియదా..?

అనంతపురం విద్య, సెప్టెంబరు 11: వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం నిర్వహించే రోజున విద్యాసంస్థలకు లోకల్ హాలిడే ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అనంతపురం నగరం, మున్సిపల్ కేంద్రాలు, ప్రధాన పట్టణాలలో ఊరేగింపుల కారణంగా రద్దీ ఉంటుందని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని సెలవు ఇస్తుంటారు. కానీ ఈ ఏడాది విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నట్లు కనిపిస్తోంది. జిల్లా కేంద్రంలో బుధవారం నిమజ్జనోత్సవం ఉంటుందని తెలిసినా.. సెలవు ప్రకటించలేదు. దీంతో విద్యార్థులు యథావిధిగా ఉదయాన్నే బడికి వెళ్లారు. పిల్లలను అలా బడి వద్ద వదిలి ఇంటికి వచ్చారో లేదో.. తల్లిదండ్రులకు 'ఈ రోజు సెలవు.. మీ పిల్లలను తీసుకెళ్లండి..' అని మెసేజ్ వచ్చింది. కొన్ని ప్రైవేటు పాఠశాలల వద్ద ఆటోవాలలు గొడవకు దిగారు. నిమజ్జనం ఉంటుందని తెలిసి పాఠశాలను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఏదైనా జరిగితే బాధ్యత ఎవరిదని నిలదీశారు. జిల్లా విద్యాశాఖలో పాలన ఎంత అధ్వానంగా ఉందో చెప్పేందుకు ఈ ఘటన ఒక ఉదాహరణ. డీఈఓ పర్యవేక్షణ మరిచారన్న విమర్శలు వస్తున్నాయి. డిప్యూటీ డీఈఓలు, కార్యాలయ సిబ్బంది ఏం చేస్తున్నారో కూడా డీఈఓ వరకూ



సెలవు అంటూ విద్యాశాఖ నుంచి బుధవారం ఉదయం వచ్చిన సందేశం

వెళ్లడం లేదని అంటున్నారు. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అయోమయం నెలకొంది. లక్షలాది మంది విద్యార్థులు, వందలాది మంది ఉపాధ్యాయులు, సిబ్బందిని పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారి తీరు ఇలా ఉండటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నఫలంగా సెలవు

అనంతపురం నగరంలో వినాయకుడి విగ్రహాల నిమజ్జనోత్సవం బుధవారం జరుగుతుందని అధికారులకు తెలుసు. నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకూ ఊరేగింపులు, డప్పు మోతలు, వాహనాల రద్దీ, జన సందోహం, ట్రాఫిక్ సమస్య కొనసాగుతాయి. అందుకే అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ఇస్తారు. బుధవారం సెలవు ఇవ్వాలని ముందురోజే కలెక్టరేట్ నుంచి జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు అందాయి. కానీ జిల్లా విద్యాశాఖ నుంచి ప్రధానోపాధ్యాయులకు, కరస్పాండెంట్లకు సమాచారం చేరవేయలేదు. దీంతో వారు బుధవారం యథావిధిగా పాఠశాలలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కొందరు ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓ కార్యాలయ సిబ్బంది 10వ తేదీ అర్ధరాత్రి కొందరికి, 11వ తేదీ ఉదయం తీరిగ్గా నిద్రలేచాక కొందరికి సెలవు సమాచారం పంపారని తెలుస్తోంది. ఈ విషయం విద్యార్థులకు తెలిసేలోగా పాఠశాలలకు చేరుకున్నారు. వారిని వదిలి వెళ్లిన తల్లిదండ్రులు, ఆటోవాలాలు నిమిషాల వ్యవధిలో తిరిగి పాఠశాలల వద్దకు వెళ్లి ఇళ్లకు తీసుకువెళ్లాల్సి వచ్చింది. ఇదేం పద్ధతి అని కొందరు తల్లిదండ్రులు, ఆటోవాలాలు ఉపాధ్యాయులు, యాజమాన్యాలతో వాగ్వాదానికి దిగారు.



తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 11: ఎన్నికల తరువాత గాలిలో తేలియాడుతున్న తహసీల్దార్లకు కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చారు. బదిలీల సమయంలో కొందరిని స్థానిక ప్రజా ప్రతినిధులు వ్యతిరేకించారు. దీంతో వారు విధుల్లో చేరలేదు. ఈ సమస్యపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. అప్పట్లో విధుల్లో చేరని ఏడుగురిని వేరే మండలాలకు కేటాయిస్తూ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరిని జిల్లాకు తీసుకొచ్చారు. కొందరు బుధవారమే విధుల్లో చేరారు.

తహసీల్దారు	పాత స్థానం	కొత్త స్థానం
మోహన్‌కుమార్	కూడేరు	అనంతపురం రూరల్
రజాక్‌వలి	కలెక్టరేట్	తాడిపత్రి
ఉషారాణి	గుంతకల్లు ఆర్డీఓ	పెద్దవడుగూరు
భూషణం	పెద్దవడుగూరు	గుంతకల్లు ఆర్డీఓ
ఈశ్వరమ్మ	తాడిపత్రి	కళ్యాణదుర్గం ఆర్డీఓ
వాణిశ్రీ	అనంతపురం రూరల్	కలెక్టరేట్ కేఆర్‌ఆర్‌సీ
అలెగ్జాండర్	రాయదుర్గం	కలెక్టరేట్
ఖతిజున్‌కూబ్రా	శ్రీసత్యసాయి జిల్లా	కలెక్టరేట్
నాగరాజు	శ్రీసత్యసాయిజిల్లా	రాయదుర్గం

20న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

ఏడు నెలల తర్వాత నిర్వహణ

అనంతపురం విద్య, సెప్టెంబరు 11: జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను సుమారు ఏడు నెలల తర్వాత మళ్లీ నిర్వహించనున్నారు. కొంతకాలంలో జడ్పీ అధికారులు, పాలక మండలి సభ్యుల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా సమావేశాలు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు ఈ నెల 20న నిర్వహించాలని పాలక వర్గం, జడ్పీ అధికారులు నిర్ణయించారు. జడ్పీ ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఫైనాన్స్ అండ్ ప్లానింగ్, వర్క్, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహిస్తారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో 10 గంటలకు విద్య-వైద్యం, మహిళ, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహిస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఆ సమయంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి వ్యవహారంపై పాలకవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. డిప్యూటీ సీఈఓను సరెండర్ చేయాలని డిమాండ్ చేసింది. సభ్యులు కింద కూర్చుని నిరసన తెలిపారు. సమావేశాలను బాయ్‌కాట్ చేశారు. నిబంధనల ప్రకారం సమావేశాలను వాయిదా పడిన మరుసటి రోజే నిర్వహించాలి. కానీ అధికారులు పట్టించుకోలేదు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, సీఈఓ బదిలీ కావడం, డిప్యూటీ సీఈఓ పట్టించుకోకపోవడంతో సమావేశాల ప్రస్తావనే రాలేదు.

రండి.. ఉద్యోగాలిస్తాం..!

అనంతపురం ప్రెస్‌క్లబ్: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాలకు దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ సూచించారు. జేఎల్, పీజీటీ, టీజీటీ, పీఈటీ, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులను డెమో ద్వారా, తాత్కాలిక ప్రాతిపదికన (గెస్ట్, పార్ట్ టైమ్) భర్తీ చేస్తామని తెలిపారు. జేఎల్‌కు పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, పీజీటీకి పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, టీజీటీకి డిగ్రీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ (టీజీటీ హిందీకి డిగ్రీతో పాటు పీజీటీ ఉండాలి), పీఈటీకి బీపీఎడ్, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, హెల్త్ సూపర్‌వైజర్‌కి బీఎస్సీ నర్సింగ్ అర్హతలు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17న ఉదయం 11 గంటలకు కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. బాలుర పాఠశాలలకు పురుషులు, బాలికల పాఠశాలల్లో మహిళలకు మాత్రమే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

ఖాళీల వివరాలు

తిమ్మాపురం బాలికల పాఠశాల	: టీజీటీ గణితం, టీజీటీ హిందీ, పీఈటీ
నల్లమాడ బాలికల పాఠశాల	: టీజీటీ భౌతికశాస్త్రం, పీఈటీ
అమరాపురం బాలికల పాఠశాల	: పీజీటీ ఇంగ్లిష్
మలుగూరు బాలుర పాఠశాల	: టీజీటీ హిందీ, టీజీటీ గణితం, టీజీటీ భౌతికశాస్త్రం
బి. పప్పూరు బాలుర పాఠశాల	: టీజీటీ హిందీ
హిందూపురం బాలుర పాఠశాల	: టీజీటీ హిందీ
ఉరవకొండ బాలికల పాఠశాల	: జేఎల్ సివిక్స్
కణేకల్లు బాలుర పాఠశాల	: హెల్త్ సూపర్‌వైజర్

టమోటా కిలో రూ.26

అనంతపురంరూరల్, సెప్టెంబరు 11: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.14 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.20వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 23 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

తుంగభద్రం చేయండి

నిపుణుల కమిటీ సూచనలు అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 11: తుంగభద్ర డ్యామ్ భద్రతపై ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యామ్ భద్రతపై జలవనరులశాఖ చేపట్టిన అధ్యయన బృందం ఇచ్చిన నివేదికను అమలు చేసేందుకు కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలతో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాకు ఉన్న ఏకైక నికర సాగునీటి వనరు తుంగభద్ర డ్యామ్ మీద ఆధారపడిన హెచ్చెల్సీ కాలవ మాత్రమేనన్నారు. డ్యామ్ పటిష్టత ప్రమాదంలో పడితే అందరికంటే ఎక్కువ నష్టం జరిగేది అనంతపురం జిల్లా రైతాంగానికి, ప్రజలకే అని పేర్కొన్నారు. డ్యామ్ భద్రతపై నిపుణుల అధ్యయన కమిటీ నివేదికపై రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, నీటిరంగ నిపుణులతో సమావేశం జరిపి, తుంగభద్ర పరిరక్షణకు, హెచ్చెల్సీ ఆధునీకరణలు పూర్తి చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

అమరుల త్యాగాలను మరువలేం: డీఎఫ్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ వినీత్ కుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 11: అమరుల త్యాగాలను మరువలేమని జిల్లా అటవీశాఖాధికారి వినీత్ కుమార్ అన్నారు. బుధవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారికి ఘన నివాళులు అర్పించారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎఫ్ఓ పాల్గొని అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటవీ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. విధి నిర్వాహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రేంజర్లు శ్రీనివాసులు, డేవిడ్, డీఆర్వో దీప, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న డీఎఫ్ఓ

నీటి వనరులు నిర్వీర్యం

ఊసులేని హంద్రీనీవా విస్తరణ.. అటకెక్కిన హెచ్చెల్సీ ఆధునీకరణ

పీఏబీఆర్ సామర్థ్యం పెంపు అంతేనా?

నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్/రాయదుర్గం, సెప్టెంబరు 11: వైసీపీ హయాంలో జలవనరుల శాఖను నిర్వీర్యం చేశారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. ఈ రెండింటి నిర్వహణకు గడిచిన ఐదేళ్లలో పైసా ఇవ్వలేదు. టీడీపీ హయాంలో మంజూరైన పనులను నిలిపివేశారు. జీడిపల్లి నుంచి పేరూరు డ్యాం, బీటీ ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు చేపట్టిన ప్రాజెక్టులను అర్ధంతరంగా ఆపేశారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ, పీఏబీఆర్ సామర్థ్యం పెంపు గురించి పట్టించుకోలేదు. ఇది చాలదన్నట్లు వైసీపీ జిల్లా కార్యాలయ భవనానికి రెండు ఎకరాల హెచ్చెల్సీ స్థలాన్ని కేటాయించారు. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. రెండేళ్లుగా మూడు గదుల్లో కార్యాలయం కొనసాగుతోంది. ఇన్ని సమస్యల నడుమ సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం గురువారం జరగనుంది. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ఐఏబీ సమావేశానికి చైర్మన్ హోదాలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షత వహిస్తారు. జలవనరుల శాఖ ప్రధాన సమస్యలపై చర్చించి, పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉంది.

ఆగిన ఆధునికీకరణ

హెచ్చెల్సీ ఆధునికీకరణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. 2008-09లో రూ.458 కోట్లతో హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. 2018 వరకు రూ.310 కోట్ల పనులు జరిగాయి. మిగిలిన రూ.148 కోట్ల పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వాటిని పూర్తి చేయాలంటే ప్రస్తుతం రూ.500 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని హెచ్చెల్సీ అధికారులు, ఇంజనీర్లు చెబుతున్నారు. ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తే 2600 క్యూసెక్కులు ఉన్న కాలువ సామర్థ్యాన్ని 4200 క్యూసెక్కులకు పెంచుకోవచ్చు. టీబీ డ్యాం నుంచి అదనంగా వరద నీటిని జిల్లాకు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

పీఏబీఆర్ నింపేది ఎన్నడు..?

జిల్లాలో అతిపెద్ద జలవనరు.. పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్). దీని పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు. కానీ ఎప్పుడూ ఇంత నీటిని నిల్వ చేసింది లేదు. భూసేకరణ చేపట్టకపోవడం, నిల్వ సామర్థ్యాన్ని పెంచకపోవడం దీనికి కారణం. పీఏబీఆర్ సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు రూ.5 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ ఏర్పాటు చేసిన పుణెకు చెందిన కంపెనీ పేర్కొంది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. 11 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి రూ.450 కోట్లు అవసరం. వరద నీటిని నిల్వ ఉంచేందుకు నిర్మించ తలపెట్టిన ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్ తయారీకి రూ.4.8 కోట్లు అవసరం. వైసీపీ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.

భవనం ఏదీ..?

ఉమ్మడి జిల్లా నీటి నిర్వహణలో కీలకమైన హెచ్చెల్సీ కార్యాలయానికి సొంత భవనం లేదు. సుమారు 20 ఎకరాల సొంత స్థలం ఉన్నా.. భవనం నిర్మించుకోలేని దుస్థితిలో హెచ్చెల్సీ అధికారులు ఉన్నారు. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని ప్రభుత్వ సర్వజన వైద్యశాల విస్తరణ కోసం ఖాళీ చేయించారు. హెచ్చెల్సీ కాలనీలో ఎస్ఈ కార్యాలయాన్ని ఒక చోట, డిప్యూటీ ఎస్ఈ కార్యాలయాన్ని మరోచోట ఏర్పాటు చేశారు. సిబ్బంది, రికార్డుల కోసం ఒక గదిని కేటాయించారు. జలవనరుల శాఖ సీఈ కార్యాలయ భవన నిర్మాణం కోసం రెండెకరాల స్థలంలో ప్రహరీ నిర్మించారు. ఆ తరువాత వదిలేశారు. కానీ వైసీపీ జిల్లా కార్యాలయం కోసం రెండు ఎకరాలను నామమాత్రపు అద్దెకు 33 ఏళ్లకు కేటాయించారు. ఆ భవనాన్ని శరవేగంగా నిర్మించారు.

హంద్రీనీవా కాలువ



సిబ్బందిని నియమించాలి..



హెచ్చెల్సీ నిర్వహణకు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. నీటి సమస్య ఏర్పడితే రైతులమే పరిష్కరించుకోవాల్సి వస్తోంది. లస్కర్లు, ఇంజనీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో లేరు. బొమ్మనహాళ్ మండలంలో హెచ్చెల్సీకి జేఈఈ ఒక్కరే ఉన్నారు. ఉన్న లస్కర్లు కూడా అందుబాటులో ఉండరు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలంటే రైతులే తూము దగ్గరకు వెళ్లి ఎత్తుకోవాలి. కాలువలపై నిద్రించాలి. సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి సమస్యను పరిష్కరించాలి.

-జనార్దనపల్లి రామాంజినేయులు, ఉద్దేహాళ్

విస్తరణ ఎన్నడు..?

హంద్రీనీవా కాలవ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం డ్యాం నుంచి 3850 క్యూసెక్కులు నీటిని తరలించేందుకు వీలుగా కాలువ ఉంది. ఎక్కువ నీటిని తక్కువ సమయంలో తరలించాలంటే కాలువ వెడల్పు పెంచాలి. లైనింగ్ వేయాలి. కాలువ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచాలని టీడీపీ హయాంలో ప్రభుత్వం నిర్ణయించింది. 2019లో కాలువ పటిష్టత పనులకు రూ.6182 కోట్లు కేటాయించింది. వైసీపీ వచ్చాక 2021లో టెండర్లు పిలిచి.. అంతటితో వదిలేశారు.

డిస్ట్రిబ్యూటరీలు ఎక్కడ..?

హంద్రీనీవా నీరు పొలాలకు చేరాలంటే పిల్ల కాలువలను (డిస్ట్రిబ్యూటరీలు) తవ్వాలి. ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రతిపాదనలు ఉన్నాయి. మొదటి విడతలో జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికోసం రూ.1500 కోట్లు అవసరమని డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపారు. ఈ ఫైల్‌ను తిరస్కరించినట్లు సమాచారం.

హెచ్చెల్సీ వెడల్పు పెంచాలి..



మా ప్రాంతంలో హెచ్చెల్సీ నీటి పైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాం. కొన్నేళ్ల నుంచి పాలకులు, అధికారులు హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయింది. కాలువను వెడల్పు చేసి, 2600 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా చేస్తే బాగుంటుంది. ఐఏబీ సమావేశంలో దీనిపై చర్చించాలి.

-రాముడు, కణేకల్లు



హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న నీరు

ఉంతకల్లు పనులు ప్రారంభించాలి..



బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద ఎస్‌ఏబీఆర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించాలి. తుంగభద్ర జలాశయం నుంచి సమాంతర కాలువ ఏర్పాటు చేయాలి. తెలుగుదేశం ప్రభుత్వమే గతంలో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రిజర్వాయర్‌ను పూర్తి చేయించాలి.

-ఆంజనేయులు, దేవగిరి

మరమ్మతు చేయండి..



తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీకి నీరు సరిగా రావడం లేదు. అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీలకు, ఆ తర్వాత పొలాలకు నీరు రావాలంటే సమస్యలను పరిష్కరించాలి. డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేయాలి. ఐఏబీ సమావేశాలలో మరమ్మతుల గురించి చర్చించాలి.

-మల్లేష్, కణేకల్లు

నేటి నుంచి రెండు ఆటలు

● దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు ● రెండు మ్యాచ్‌లు... నాలుగు జట్లు







అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11: దులీప్‌ట్రోఫీలో భాగంగా బుధవారం నుంచి సెకండ్ రౌండ్ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ వేదికగా 12 నుంచి 15వతేదీ వరకు మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇండియా ఏ, బీ, సీ, డీ జట్ల ప్లేయర్లు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. గురువారం ఏసీజీ ఏ, ఏసీజీ బీ స్టేడియాల్లో రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఏ గ్రౌండ్‌లో ఇండియా-ఏ, ఇండియా డీ జట్ల మధ్య, బీ గ్రౌండ్‌లో ఇండియా-బీ, ఇండియా-సీ జట్ల మధ్య సెకండ్ రౌండ్‌లో పోటీలు జరగనున్నాయి. పోటీలకు సంబంధించి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, బీసీసీఐ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్‌లు ఏసీజీ ఏ, ఏసీజీ బీ మైదానాలను పరిశీలించారు. క్రీడాకారుల పెవిలియన్, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు గురించి పోలీసుల నుంచి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఏసీజీ-ఏ మైదానంలోకి మాత్రమే ప్రేక్షకులను అనుమతిస్తారు. ఇందులో ప్రధానంగా వీఎంఓఏ గ్యాలరీలోకి ప్లేయర్లు తప్పా ఎవరూ అటువైపు వెళ్లకుండా నిషేధించారు. ఇక బ్లాక్ ఏ, బీ గ్యాలరీల్లో వీఐపీలు, ప్రజాప్రతినిధులు, బీసీసీఐ ప్రతినిధులకు ఏర్పాట్లు చేశారు. ఇక బ్లాక్ సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీల్లో ప్రేక్షకులు, విద్యార్థులకు అనుమతించారు. గేట్-1 నుంచి బ్లాక్ సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీలకు వెళ్లే ప్రేక్షకులకు ప్రవేశం ఉంటుంది. క్రీడాకారులు, వీఐపీలకు గేట్-2 నుంచి ప్రవేశం కల్పించారు. గేట్-3 నుంచి ఆర్డీటీ సిబ్బంది, నిర్వాహక సిబ్బందికి అనుమతి ఉంటుంది. కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మహిళా జట్టు ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, ఏసీఏ లాజిస్టిక్ మేనేజర్ గౌరీశంకర్, అడ్మిన్ మేనేజర్ ఆదిత్యవర్మ, మీడియా మేనేజర్ రాజగోపాల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ మహిళలకు పచ్చళ్లు, ఊరగాయలు, మసాలా పౌడర్, అప్పడాల తయారీపై ఈనెల 19 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. పదిరోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉమ్మడి జిల్లాలోని 19-45 సంవత్సరాల వయస్సు గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479లను సంప్రదించాలని కోరారు.

బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు బుధవారం తెలిపారు. జూలైలో తృతీయ సంవత్సరం ఒకటి, రెండో సెమిస్టర్(ఆర్15,19)తోపాటు నాలుగో సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్15,19) పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంబీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్17,21), ఎంసీఏ ఒకటో సెమిస్టర్(ఆర్20,21) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, నాలుగో సెమిస్టర్(ఆర్20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఏడు నెలల జీతాల విడుదల

పుట్టపర్తి, సెప్టెంబరు 11 : ఉమ్మడి జిల్లాలో శ్రీసత్యసాయి వాటర్‌ప్రాజెక్టు కార్మికులకు ఏడు నెలల జీతాలు విడుదలయ్యాయని కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు మధు, మురళి, చంద్ర, హరీష్, వేణుగోపాల్ బుధవారం పేర్కొన్నారు. రెండు నెలలుగా జీతాల కోసం పోరాటం చేశామని, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తమ కష్టాలను పరిశీలించి జీతాల విడుదలకు కృషి చేశారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 536 మంది కార్మికులకు దాదాపు రూ. 30 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ సందర్భంగా వారు ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తాం

తేల్చిచెప్పిన తాగునీటి కార్మికులు.. అధికారులతో చర్చలు విఫలం



అధికారులతో చర్చలు సాగిస్తున్న యూనియన్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు11: తమ సమస్యలను పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని తాగునీటి సరఫరా పథకాల కార్మికులు స్పష్టం చేశారు. కూడేరు మండలంలోని పీఏబీఆర్ వద్ద వారం రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో బుధవారం ఇన్‌చార్జి డీపీఓ వసంతబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా చర్చలు సాగించారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామనీ, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సజావుగా నీటి సరఫరా సాగేలా చూడాలని తెలిపారు. అందుకు కార్మికులు ఒప్పుకోలేదు. సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని తేల్చిచెప్పారు. బుధవారం సమ్మెలో భాగంగా పీఏబీఆర్‌లో కార్మికులు జల దీక్ష చేపట్టారు. దీంతో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బయటకు రా.. ప్రైవేట్‌గా కలుద్దాం

ఎస్కేయూ విద్యార్థినికి లైంగిక వేధింపులు

వైసీపీ విద్యార్థి విభాగ నాయకుడిపై కేసు



వసి కిరణ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11: వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం నాయకుడు వసి కిరణ్ అలియాస్ వాసు.. ఎస్కేయూ పీజీ విద్యార్థినిని వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై బుధవారం కేసు నమోదు చేశారు. గతంలో ఉన్న పరిచయాన్ని ఆసరగా చేసుకుని తనను వేధిస్తున్నాడని, బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని బాధితురాలు ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, అతని ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ హేమంత్‌కుమార్ తెలిపారు. విషయం తెలియగానే వాసు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అనంతపురం నగరానికి చెందిన వాసు.. వైసీపీ విద్యార్థి విభాగ నాయకుడిగా ఉన్నాడు. గతంలో ఎస్కేయూలోనే చదివాడు. ఇప్పటికీ ఎస్కేయూ హాస్టల్‌లోనే ఉంటున్నాడు. గత ఏడాది పీజీలో చేరిన విద్యార్థినిని కలిసిన సందర్భంలో ఫొటోలు తీసుకున్నట్లు సమాచారం. ఆ ఫొటోలను ఆసరాగా చేసుకుని మూడు నెలల నుంచి వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'బయటకు రా.. ప్రైవేట్‌గా రూమ్‌లో కలుద్దాం' అంటూ తరచూ ఫోన్ చేసి వేధిస్తున్నాడని, ఫొటో తన తండ్రికి చూపిస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో చెప్పలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని పోలీసుల వద్ద ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం


నార్పలలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

నార్పల, సెప్టెంబరు11: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో వినాయకవిగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వినాయక విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేస్తూ యువకులు, మహిళలు పెద్దలు కలిసి డప్పుల ముందు డ్యాన్సులు చేస్తూ, రంగులు చల్లుకుంటూ గ్రామ సరిహద్దులోని చెరువుల్లో, బావుల్లో నిమజ్జనం చేశారు. అలాగే నార్పలలో పలు కాలనీల్లో ఉన్న వినాయక విగ్రహాల మండపాల వద్ద భక్తాదులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సాగర్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్మయానగర్‌లో..


భారీ జనసందోహం మధ్య తరలుతున్న వినాయకుడు

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయానగర్‌లో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. చిన్మయానగర్‌లో కొలువుదీర్చిన పెద్దపెద్ద విగ్రహాలను డప్పులు, డీజేలతో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ డ్యాన్స్ వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం వినాయక విగ్రహాలను రాప్తాడు సమీపంలోని పండమేరు వంకలో నిమజ్జనం చేశారు. చిన్మయానగర్, అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల వినాయక విగ్రహాలను పండమేరు వంకలో నిమిజ్జనం చేసేందుకు రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, పంచాయతీ కార్యదర్శి అన్ని ఏర్పాట్లు చేశారు. పండమేరు వంక పరిసరాల్లో విద్యుత్ స్తంబాలకు ఎల్ఈడీ లైట్లు అమర్చారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా రాప్తాడు సీఐ శ్రీహర్ష, పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న నారాయణచౌదరి

రామగిరి, సెప్టెంబరు 11: మండలంలో రైతుసేవా కేంద్రాలలో ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్‌నారాయణచౌదరి ప్రారంభించారు. రామగిరి, ఎంసీ పల్లి, పేరూరు తదితర గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో రైతులకు విత్తనాలు అందించారు. 80 శాతం సబ్సిడీ ధరపై ఉలవలు, అలసందలు,జొన్నలు పంపిణీచేశారు. వ్యవసాయాధికారులతోపాటు రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు. నాయకులు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించాలి


సమావేశంలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 11: స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణలో 20, 21వ తేదీల్లో నిర్వహించే స్కూల్‌గేమ్స్‌ను విజయవంతం చేయాలని ఆ పాఠశాల హెచ్ఎం ఓబుళమ్మ కోరారు. పాఠశాలలో బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అండర్-14, 17 విభాగాలలో బాలుర, బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. ప్రధానంగా ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పీడీ నల్లప్ప, విజయనిర్మల, అంజన్న, కుమార్‌రాజ, సుధాకర్, కుసుమ, కొండమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

గంగాధర్‌కు టీడీపీతో సంబంధంలేదు

రామగిరి, సెప్టెంబరు 11: మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన సంఘటనలో నిందితుడు గంగాధర్‌కు తెలుగుదేశం పార్టీతో ఎటువంటి సంబంధంలేదని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సుద్దకుంటపల్లిలో గంగాధర్, కేశవులు అన్నదమ్ముల కుమారులు అని వారి వ్యక్తిగత కుటుంబ, ఆర్థిక కలహాలతో గొడవజరిగిందన్నారు. సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, మండల ఉపాధ్యక్షులు ఆంజనేయులు, అక్కులప్ప, మాజీ సర్పంచ్ ఇటిక నల్లప్ప, పేపర్ శీన, రఘురాం, ఆనంద్ పాల్గొన్నారు.

హనుమంతు సేవలు మరువలేనివి

ఆత్మకూరు సెప్టెంబరు 11: హనుమంతు సేవలు మరువ లేనివని జిల్లా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కొనియాడారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో హనుమంతు సంతాప సభ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ భూ పోరాటాలలో ఎంతో ధైర్యంగా పేదలు కోసం పని చేశారని, అలాంటి నాయకులు ప్రజలకు అవసరమని, కాని రోడ్డు ప్రమాదంలో దురదృవశాత్తు మృతి చెందడం బాధాకరమన్నారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర రెడ్డి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి, నాగరాజు, ఐఎఫ్‌టీయూ సభ్యులు బండారు శంకర్, చంద్రప్ప, నాగభూషణం, శివశంకర్, చౌడప్ప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కిట్లతో పౌష్టికాహారం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 11: అంగన్‌వాడీలో బాలింతలకు, గర్భిణులకు అందించే కిట్లతో పౌష్టికాహారం లభిస్తుందని సూపర్‌వైజర్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వికలాంగుల కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి కవిత, జీఎంఎస్ ప్రసన్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, లలిత, సహాయకులు నూరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఝాన్సీరాణి

నగరంలో ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం


సప్తగిరి వినాయక మండపం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి




క్లాక్ టవర్ వద్ద సందడే సందడి




భక్తజన సందోహం నడుమ నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


యువతుల కోలాహలం


హమాలీ కాలనీ రూ.36 వేలకు లడ్డూను దక్కించుకున్న వెంకటరమణ

జగన్ ఉండి ఉంటే.. జల సమాధులు చూడాల్సి వచ్చేది

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


వరద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 11: విజయవాడ, గుంటూరు జిల్లాల్లో సంభవించిన వరద విపత్తు సమయంలో జగన్ సీఎంగా ఉండి ఉంటే జల సమాధులు చూడాల్సి వచ్చేదని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం లంక గ్రామాల పరిధిలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. వరదల్లో మునిగిన కంద, పసుపు, అరటి, మొక్కజొన్న పంటలపొలాలను పరిశీలించారు. లక్షలాది రూపాయలు పెట్టుబడితో సాగుచేసిన పంటలు పూర్తిగా నీటిపాలయ్యాయని, ఒక్క రూపాయి వచ్చే పరిస్థితి లేదని బాధిత రైతులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన చెందారు. ప్రభుత్వం తప్పనిసరిగా పంటనష్టపరిహారం అందించి ఆదుకుంటుందని భరోసానిచ్చారు. అన్నవరపులంక గ్రామంలో వరదలతో సర్వం కోల్పోయిన బాధిత ప్రజలను పరామర్శించారు. అనంతరం గుంటూరు జడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టినా, హార్వెస్ట్ ఇండియా సంస్థ నిర్వాహకులు సురేష్ సహకారంతో దుప్పట్లు, దోమతెరలు, వంట పాత్రలను పరిటాల సునీత పంపిణీ చేశారు. అనంతరం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 61వ డివిజన్‌లో శాంతినగర్ మజీద్ ప్రాంతంలో ఆమె పర్యటించారు. అక్కడి వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వరదలను లెక్కచేయకుండా సీఎం చంద్రబాబునాయుడు ఒక శ్రామికుడిలా పనిచేస్తూ ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని తగ్గిస్తున్నారన్నారు.

విచారణ చేయకుండానే సమస్యకు పరిష్కారమా?

● అర్జీల పట్ల అధికారుల తీరు మారాలి
● కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం



అనంతపురం టౌన్, సెప్టెంబరు 11: బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను విచారించకుండానే దానిని పరిష్కరించినట్లు రికార్డులలో నమోదు చేయడం ఏంటని అధికారుల తీరుపై కలెక్టర్ వినోద్ కుమార్ మండిపడ్డారు. బుధవారం కలెక్టర్ క్యాంపు ఆఫీస్ నుంచి గ్రీవెన్స్ ఫిర్యాదులపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ అర్జీలను పరిష్కరించడంలో కొందరు నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. నిబంధనల మేరకు ఫిర్యాదుదారునితో మాట్లాడి ఆ సమస్యగురించి చర్చించి పరిష్కారంచూపాల్సి ఉంటుందన్నారు. కానీ తాను ఓ రైతును స్వయంగా పలకరించగా తనతో ఎవరూ మాట్లాడకుండానే సమస్యను తీర్చినట్లు నమోదు చేశారని తెలపారన్నారు. అలాగే రెండురోజులు ముందు మరికొందరు ఫిర్యాదులు ఓపెన్ చేసి ఏదో ఒక సమాధానం రాసి సమస్య పరిష్కారం అయినట్లు తెలుపుతున్నారన్నారు. దీన్ని బట్టి అర్జీల పరిష్కారంలో అధికారులు ఎలా వ్యవహరిస్తున్నారో తెలుస్తోందన్నారు. మీవల్ల వచ్చిన ఫిర్యాదులే రిపీట్ అవుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికీ 124 ఫిర్యాదులు రిపీట్ అయ్యాయని వివరించారు. ఇది మంచిపద్ధతి కాదని ఇంకోసారి అలాచేసినోళ్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఈపంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయండి

జిల్లాలో ఈపంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15లోగా ఈపంట నమోదు పూర్తి కావాలన్నారు. జిల్లాలో ప్రతి ఎకరాకూడా సాగులోకి వచ్చేవిధంగా చూడాలన్నారు. కౌలు రైతుకార్డుల జారీలో అలసత్వం వహించకుండా నిర్దేశిత కాలంలోనే పూర్తిచేయాలన్నారు. అలాగే వేరుశనగ పంట సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణాలను తెలియజేయాలన్నారు. వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, ఏపీఎంఐపీ, చేపలు, మార్కెటింగ్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్‌గా మోహన్‌కుమార్



అనంతపురంరూరల్, సెప్టెంబరు 11: అనంతపురం రూరల్ మం డల తహసీల్దార్‌గా మోహన్‌కుమార్ నియమితులయ్యారు. ఆ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పలువురు అధికారులు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడకు నియమించిన వాణిశ్రీ విధుల్లో చేరకపోవడంతో కూడేరుకు నియమితులైన మోహన్‌కుమార్‌ను రివైజ్ ఉత్తర్వులో మార్పు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు వెలువరిచారు.

పకడ్బందీగా లా పరీక్షలు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 11: న్యాయవిద్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పరీక్షల నిర్వహణ విభాగాధిపతి జీవీ రమణ, నియంత్రణ అధికారి డాక్టర్ లోకేష్‌తో కలిసి రిజిస్ట్రార్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఎల్‌బీ, ఆరవ సెమిస్టర్, బీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు తగిన సౌకర్యాలను కల్పించి సజావుగా పరీక్షలు కొనసాగేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమని అధికారులను ప్రశంసించారు.

15న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11: ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15వ తేదీన ఎస్‌కే యూనివర్సిటీ స్పోర్ట్స్ మైదానంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. 2010 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నిర్వహించే జాతీయ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 7989017210 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ఇద్దరికి గాయాలు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 11: మండల పరిధిలోని రేకలకుంట గ్రామం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. అనంతపురం పట్టణానికి చెందిన పవన్‌కుమార్ బుధవారం నార్పలకు వ్యక్తిగత పనిమీద వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి ద్విచక్రవాహనంలో అనంతపురానికి బయల్దేరాడు. రేకలకుంట గ్రామం వద్దకు రాగనే నార్పలకు చెందిన కిరణ్ అనే యువకుడు ద్విచక్రవాహనంలో ఎదురుగా వచ్చి ఢీ కొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన అస్పత్రికి తీసుకెళ్లారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు చేస్తున్నారు.

14 మందికి ఉద్యోగాలు



దివ్యాంగుడికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 11: జిల్లాలో 2022-23 సంవత్సరానికి సంబంధించి బ్యాక్‌లాక్ పోస్టుల కింద బుధవారం 14 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. వివిధ శాఖల పరిధి కింద పీహెచ్‌కోటాకు సంబందించిన పోస్టులలో దివ్యాంగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎంపికైన 14మందికి కలెక్టరు చేతులమీదుగా ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ మారుతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరికి గాయాలు

అనంతపురం క్రైం,సెప్టెంబరు 11: రోడ్డు ప్రమాదంలో ఓ గొర్రెలకాపరికి గాయాలయ్యాయి. గుంతకల్లు ప్రాంతానికి చెందిన రంగ్వామి గత కొన్ని రోజులుగా నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో గొర్రెలను మేపుతున్నాడు. బుధవారం రోడ్డు దాటుతుండగా వేగంగా వెళ్తున్న బైక్ ఢీకొంది. తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కాలనీకి చెందిన నరసింహులుకు 50 సంవత్సరాలు అని ఈయన డయాలసిస్ రోగి అన్నారు. 9వ తేదీన ఉదయం టిఫన్ తెచ్చుకోవడానికి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆయన భార్య నారాయణమ్మ మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. చుట్టుపక్కల, తమ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా తప్పిపోయిన వ్యక్తి వివరాలు తెలిస్తే సీకేపల్లి ఎస్ఐ 9440796836, రామగిరి సీఐ 9440796835 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

జిల్లావ్యాప్తంగా స్టాఫ్‌నర్సుల ఆందోళన

● రెగ్యులర్ చేసేవరకు కొనసాగిస్తామని హెచ్చరిక



జిల్లా ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు11: తమను రెగ్యులర్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు చేపడుతున్న ఉద్యమం ఊపందుకుంది. రెండురోజులుగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు బహిష్కరించి నిరసనలు కొనసాగిస్తున్నారు. బుధవారం స్టాఫ్‌నర్సులు ఆందోళనలు జిల్లా వ్యాప్తంగా మొదలయ్యాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో వందలాదిమంది స్టాఫ్‌నర్సులు విధులు బహిష్కరించి మూడోరోజు ఆందోళన చేపట్టారు. జీఓ 115ను రద్దుచేయాలంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్టాఫ్‌నర్సులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ వస్తున్నామన్నారు. రెగ్యులర్‌తో పాటు సమానపనికి సమాన వేతనం ఇవ్వడంలేదన్నారు. రెగ్యులర్‌చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పుకుంటూ వస్తున్నా అమలుచేయకుండా వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం మళ్లీ స్టాఫ్‌నర్సులు నియామకాల నోటిఫికేషన్‌కు జీఓ115ను విడుదల చేశారన్నారు. దీనివల్ల తమకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేసేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. స్టాఫ్‌నర్సులు సంఘం నాయకులు పద్మలత, శ్రీదేవి, కళావతి, శోభ, అనితతోపాటు నర్సులు పాల్గొన్నారు.

అనంతలక్ష్మి కళాశాలకు స్వయంప్రతిపత్తి


మాట్లాడుతున్న అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 11: జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలైన అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్(స్వయంప్రతిపత్తి) హోదా లభించింది. సాధారణ కళాశాలగా ఏర్పాటై బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్ కోర్సులను ప్రవేశపెట్టి ప్రతి ఏటా వేలాదిమంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తోంది. అధునాతన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ల్యాబ్‌లు, లైబ్రేరీలు, ప్రత్యేక నైపుణ్య శిక్షణ విభాగం తదితర సౌకర్యాలను ఏర్పాటుచేశారు. కోర్సులు పూర్తయిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించడంలో ప్రథమ స్థానంలో నిలించింది. పూర్తిస్థాయి బోధన, బోధనేతర సిబ్బంది నియామకం, పరిశోధనలపై ప్రత్యేక దృష్టి, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఈ-లైబ్రేరీస్ ఇలా ఉన్నత విద్యకు అనువైన కళాశాలగా పురోగతిని సాధించడంతో అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) అటానమస్ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి కేక్‌ను కట్‌చేసి బుధవారం సంబరాలు చేసుకున్నారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ


42వ డివిజన్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు విజయవాడ వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలోని 42వ డివిజన్‌లో వరద బాధితులకు దుప్పట్లు అందజేశారు. నాయకులు దేవళ్ల మురళీ, గోపాల్ గౌడ్, రామాంజనేయులు, వడ్డే మురళీ, రవి చౌదరి, సున్నం శ్రీనివాసులు, గోవర్ధన్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అమలు చేయాలి


కలెక్టర్‌కు రాజ్యాంగం పుస్తకాన్ని అందజేస్తున్న గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11: ప్రభుత్వ శాఖల్లో భారత రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డిలను వేర్వేరుగా కలిసిన సంఘం నాయకులు అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగ ప్రతులను అందజేశారు. రవిశంకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలని, ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీల్లో న్యాయం చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేద్దాం...అందరికీ న్యాయం చేద్దామని పిలుపునిచ్చారు. నాయకులు సోమశేఖర్, శ్యాంబాబు, సుగప్ప, భానుప్రకాష్ పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్‌తో ఉద్యోగ అవకాశాలు


ఎంపిక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామమూర్తి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 11: అప్రెంటిస్‌షిప్‌తో ఉద్యోగ అవకాశలు మెండుగా లభిస్తాయని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో అప్రెంటిషిప్ మేళాను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు వారి ట్రేడ్‌లకు అనుగుణంగా సంబంధిత పరిశ్రమల్లో శిక్షణ ఇచ్చేందుకు అప్రెంటిషి ఎను మేళాను నిర్వహించామన్నారు. ఉమ్మడి జిల్లానుంచి 105మంది విద్యార్థులు హాజరుకాగా 35 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎంపిక పత్రాలందజేసి ప్రశంసించారు. జిల్లా కన్వీనర్ రాయప్పరెడ్డి, ప్రిన్సిపాల్ నాగరాజు, ట్రైనింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కొనసాగిన వైద్యశిబిరం

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 11: మండలంలోని ముష్టికోవెల గ్రామంలో బుధవారం రెండవ రోజు కూడా వైద్యశిబిరాన్ని కొనసాగించారు. వినాయక ఉత్సవాలలో విషతుల్యమైన ప్రసాదం తిని 60 మంది అస్వస్థకు గురైన విషయం తెలిసిందే. దీంతో వైద్యాధికారులు అక్కడ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యసిబ్బంది తెలిపారు.


ముష్టికోవెలలో సర్వేచేస్తున్న వైద్యసిబ్బంది

టౌన్‌బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటుకు లైసెన్స్



లైసెన్స్ పత్రాన్ని అందుకుంటున్న గుత్తి టౌన్ బ్యాంక్ చైర్మన్, సీఈఓ

గుత్తి, సెప్టెంబరు 11: అనంతపురంలో గుత్తి టౌన్ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటుకు లైసెన్స్ మంజూరైనట్లు బ్యాంక్ చైర్మన్ అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. హైదరాబాదులోని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయంలో బుధవారం ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏఓ బషీర్ చేతుల మీదుగా బ్యాంక్ చైర్మన్ అబ్దుల్ జిలాన్, బ్యాంక్ సీఈఓ మహేశ్వరప్రసాద్ లైసెన్స్ పత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు తర్వలోనే అనంతపురంలో గుత్తి కోఆపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు.

మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 11: మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, 11 నుంచి 18వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవడానికి, 19వరకు వెబ్ ఆప్షన్స్ మార్చుకోవడానికి అవకాశం ఉంటుదన్నారు. సీట్ల కేటాయింపు 22వ తేదీన జరుగుతుందని తెలిపారు. వెబ్ ఆప్షన్ ఇచ్చుకున్న విద్యార్థులు ఈ నెల 22 నుంచి 25వ తేదీ లోగా సంబంధిత కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇది అడ్మిషన్లకు చివరి అవకాశమని, ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీడీపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 11: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 932 క్యూసెక్కులుకు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 54 క్యూసెక్కుల నీరు వెళుతోందని అధికారులు వెల్లడించారు.

సక్రమంగా వైద్యం అందించాలి

● టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 11 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారితో పాటు కొందరు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మహేంద్ర, టీడీపీ నాయకులు పయ్యావుల నాగరాజు అన్నారు. అందరూ అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారు బుధవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.... . గాయాలతో వచ్చినవారికి కనీసం డ్రస్సింగ్ చేసే వారు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం వాతావరణం మార్పుల వల్ల జ్వరాలు వస్తున్నాయని, ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపో తే ఎలా అని మండిపడ్డారు. వైద్యాధికారి, సిబ్బంది తీరు మారాలని ఇలాగే వ్యవహరిస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామని వారు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పామిడి, సెప్టెంబరు 11 : పట్టణంలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రవి మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో పామిడి మండల టీం తారక్ సభ్యులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

గాలిమరల సిబ్బందిపై కార్మికుల దాడి?

పుట్లూరు, సెప్టెంబరు 11: మండలంలోని ఎల్లుట్ల గ్రామశివారులో ఉన్న గాలిమరల సూపర్‌వైజర్లపై అక్కడే పనిచేసే కార్మికులు మంగళవారం రాత్రి దాడి చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు... గాలిమరల్లో పనిచేసే సుమారు 20మందికి ఆగస్టు నెలకు సంబంధించి జీతాలు రావాల్సి ఉంది. వారి ఖాతాల్లోకి జమచేస్తామని గాలిమరల సూపర్‌వైజర్లు చెప్పారు. అయిత తమకుకు నగదు కావాలని కార్మికులు పట్టుబట్టడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తులైన కార్మికులు మరికొంతమందిని పిలిపించి సూపర్‌వైజర్లపై దాడిచేసినట్లు తెలిసింది. జీతాలు చెల్లించాలని ఇటీవల కార్మికులు నిరసన తెలిపిన విషయం విదితమే. దీంతో బుధవారం కొందరు వ్యక్తులు పంచాయతీ చేసి రాజీ చేసినట్లు సమాచారం.

తాగునీటి కార్మికుల భిక్షాటన

పెద్దవడుగూరు: ఆర్నెల్లుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలంటూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు బుధవారం మండలంలోని మిడుతూరులో భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. కార్మికులు కృష్ణమూర్తి, శ్రీనివాసులు, బాషా, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

కారు, బైకు ఢీ - యువకుడి మృతి

కళ్యాణదుర్గం (కంబదూరు), సెప్టెంబరు 11: కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం, ఇన్నోవా కారు ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలం మారెంపల్లి తండాకు చెందిన రమేష్ నాయక్ (29) బెంగళూరులోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా కంబదూరు మండలం కదిరిదేవరపల్లి వద్ద, అదే దారిలో కళ్యాణదుర్గం నుంచి కంబదూరుకు వెళ్తున్న ఇన్నోవా కారు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలో ఉన్న రమేష్‌నాయక్ గాయాలతో పడిపోయాడు. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్థారించారు. మృతుడికి భార్య మమతా భాయ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ద్విచక్రవాహనం చోరీ

గుత్తి, సెప్టెంబరు 11: గుత్తిఆర్ఎస్‌లోని టిపూఫ్ మకాన్ వద్ద నివాసమున్న షేక్ హుసేనీ అలీబాషాకు చెందిన ద్విచక్రవాహనాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఇంటి వద్ద నిలిపి ఉన్న ఏపీ 02 ఏపీడబ్ల్యూ 4149 సీబీ షైన్ ఎఫ్ డిస్క్ బ్రేక్ ద్విచక్రవాహనాన్ని చోరీ చేసినట్లు బాధితుడు వాపోయాడు. గతంలో కూడా మసీదు సమీపంలోని కాలనీలో ఓ ద్విచక్రవాహనం చోరీకి గురైందన్నారు. బాధితుల ఫిర్యాదు పోలీసులు కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బెళుగుప్ప, సెప్టెంబరు 11: మండలంలోని కోనంపల్లికి చెందిన వన్నూరు స్వామి అనే యువకుడు బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతో విరక్తి చెంది గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి ఎదుట క్రిమిసంహారక మందు తాగాడు. గ్రామస్థులు అడ్డుకుని అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఇమాంపురంలో చిరుత సంచారం

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 11: మండలంలోని ఇమాంపురం గ్రామ సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామాశివారులోని కొండప్రాంత సమీపంలో ఉన్న కదిరప్ప పొలంలో మంగళవారం చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బుధవారం అటవిశాఖ అధికారులు, పోలీసులు గ్రామ సమీపంలోని కదిరప్ప పొలాన్ని పరిశీలించారు. పొలంలో చిరుత సంచరించిన పాద ముద్రలను గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రజలకు వారు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11: రోడ్డు ప్రమాదంలో ఓ గొర్రెలకాపరికి గాయాలయ్యాయి. గుంతకల్లు ప్రాంతానికి చెందిన రంగస్వామి కొన్ని రోజులుగా అనంతపురం నగర శివారులోని టీవీ టవర్ సమీపంలో గొర్రెలను మేపుతున్నాడు. బుధవారం రోడ్డు దాటుతుండగా బైకు ఢీ కొంది. అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తాడిపత్రిలో వినాయకులకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



ఊరేగింపుగా వస్తున్న వినాయక విగ్రహాలు

ఘనంగా గణేశ్ నిమజ్జనం

తాడిపత్రి, సెప్టెంబరు 11: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో విగ్రహాల నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మండపాల వద్ద గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సీబీరోడ్డు, యల్లనూరురోడ్డు, పుట్లూరురోడ్డు, మెయిన్‌బజారు, గాంధీకట్ట మీదుగా ఊరేగించారు. దాదాపు 200 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండలంలోని యర్రగుంటపల్లి, ఆలూరు, తేరన్నపల్లి, బొందలదిన్నె, పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగుపల్లి సరిహద్దులో ఉన్న వంకలు, వాగులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం దాదాపు 3గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 10గంటలకు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకురావాల్సి ఉండగా మధ్యాహ్నం ఒంటి గంట అయినా చేరుకోకపోవడం గమనార్హం. పోలీసులు మండపాల నిర్వాహకులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడమే కారణం అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అపశ్రుతి : విద్యుత్ వైర్లు తగిలి పట్టణంలోని యల్లనూరురోడ్డులో వస్తున్న భారీ వినాయక విగ్రహం తలభాగం కిందపడింది. ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వెనుకవైపు జనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. నిర్వాహకులు విగ్రహాన్ని మరో ట్రాక్టర్‌లో నిమజ్జనానికి తరలించారు.

ఉరవకొండ: గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఉరవకొండ పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ మండపాలలో కొలువు దీరిన విగ్రహాలను విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి హంద్రీనీవా కాలువ, హెచ్చెల్సీలో నిమజ్జనం చేశారు. సీఐ సురేష్‌బాబు పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని 10వవార్డులో కాణిపాక వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయకుడి చేతిలోని లడ్డుకు మంగళవారం రాత్రి వేలం పాట నిర్వహించారు. బాబు అనే భక్తుడు రూ.72వేలకు దక్కించుకున్నారు. వెండిగొలుసును పెద్దకోట్ల మురళి రూ.25వేలకు, వెండి కడియాన్ని ప్రతాప్ 13వేలకు, శాలువాను జంగం రాజా రూ.12 వేలకు, కండువాను ఎద్దకోట్ల వన్నూరుస్వామి రూ.8వేలుకు దక్కించుకున్నారు.

కణేకల్లు: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర ఆలయం వద్ద ప్రతిష్ఠించిన విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించి నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు వీరేష్, లోకేష్, మంజునాథ్, చంద్రశేఖర్‌గుప్త, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, కురుబ నాగరాజు, అనిల్, చంద్ర, నాగు, గామేష్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.



ఉరవకొండలో నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్న యువకులు



కణేకల్లులో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

కాలువ గట్టు మరమ్మతులు ప్రారంభం

విడపనకల్లు, సెప్టెంబరు 11: నాలుగు రోజుల క్రితం కోతకు గురైన గుంతకల్లు బ్రాంచ్ కాలువ గట్టు మరమ్మతుల పనులను అధికారులు ప్రారంభించారు. ఉండబండ పెద్ద వంక వద్ద నాలుగు రోజులు క్రితం జీబీసీ అక్విడెట్‌కు సైడ్ వాల్ కూలి పోవడంతో సాగు నీరు బంద్ చేశారు. మంగళవారం పరిశీలించిన జీబీసీ అధికారులు బుధవారం పనులు ప్రారంభించారు. శుక్రవారానికి పూర్తిఅవుతాయని అధికా రులు తెలిపారు.

భారీగా పట్టుబడిన రేషన్ బియ్యం, కర్ణాటక మద్యం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 11: కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని, కర్ణాటక మద్యాన్ని మండలంలో మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన వడ్డే రామకృష్ణ, బుజ్జిరెడ్డి, ఉప్పరహాళ్ గ్రామానికి చెందిన గంగాధర అనే వ్యక్తులు అక్రమంగా కేఏ 17 డీ 1596 నంబరు గల బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నారు. ఈ సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి బొమ్మనహాళ్ మండలంలోని కల్లదేవనహళ్లి సమీపంలో హగరి బ్రిడ్జి వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిశీలించగా 47 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో చంద్రశేఖర్, వడ్డే రామకృష్ణ, బుజ్జి రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని మరో వ్యక్తి గంగాధర పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇది ఇలా ఉండగా కర్ణాటకలోని రూపనగుడి నుంచి మద్యం తీసుకొస్తున్నట్లు సమాచారం రావడంతో బొల్లనగుడ్డం చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంలో 12 మద్యం బాక్సులు(1152 టెట్రాప్యాకెట్లు) తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, రాయదుర్గం కోర్టులో హాజరుపరచన్నట్లు తెలిపారు. రేషన్‌బియ్యం, కర్ణాటక మద్యాన్ని పట్టుకోవడంలో కానిస్టేబుళ్లు రుద్ర, రవికుమార్ కీలకంగా వ్యవహరించారని ఎస్ఐ అభినందించారు.

దేశంలో అతిపెద్ద పార్టీ బీజేపీ: చిరంజీవిరెడ్డి

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 11: దేశంలో 18 కోట్ల సభ్యత్వం కలిగిన ఏకైక అతి పెద్ద పార్టీ బీజేపీ అని నియోజకవర్గ సభ్యత్వ నమోదు అభియాన్ రాయదుర్గం ఇన్‌చార్జ్ చిరంజీవిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు రాయదుర్గం, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాలో సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. బూత్ శక్తి కేంద్రాల అధ్యక్షులు ఒక్కొక్కరు 200 మంది సభ్యత్వం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జింకా వసుంధర, హీరోజీరావు, పట్టణ అధ్యక్షుడు అంబోజీరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, నమస్కారం శివ, తిమ్మారెడ్డి, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 11: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నా యకులు మాట్లాడుతూ... దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, మహిళామోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు కొలిమి హరిహరనాథ్, కొలిమి శేఖన్న, బీజేఎం జిల్లా కార్యదర్శి కేశవ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

గుత్తి, సెప్టెంబరు 11: పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ యాదుల్లా తన నిజాయతీ చాటుకున్నాడు. అతడి ఆటోలో ప్రయాణికులెవరో బుధవారం ఖరీదైన సెల్‌ఫోన్ మరిచిపోయారు. ఇది గమనించిన యాదుల్లా దాని యజమాని వివరాలపై ఆచూకీ తీశాడు. ఆ సెల్‌ఫోన్ గుత్తిఆర్ఎస్‌కు చెందిన కళ అనే మహిళదిగా తెలుసుకుని ఆమెకు అందజేశాడు.

మెగామాల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, సెప్టెంబరు11: రెండురోజుల క్రితం పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న లలితా మెగామాల్‌లో విద్యుదాఘాతం జరిగి సుమారు రూ.1.50కోట్లు నష్టం వాటిల్లిన విషయం విదితమే. బుధవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మెగామాల్‌కి వెళ్లి కాలిపోయిన వస్తువులు, సరుకులను పరిశీలించారు. షార్ట్‌సర్క్యూట్‌కు గల కారణాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదానికి కారణమైన గోడౌన్‌ను పరిశీలించారు. అండగా ఉంటామని నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుస్వామి, జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు మల్లికార్జునరెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దిలీప్ తదితరులు ఉన్నారు.

జీఓ నంబర్ 115ను రద్దు చేయాలి

గుత్తి, సెప్టెంబరు 11: ప్రభుత్వం వెంటనే జీఓ నెంబర్ 115ను రద్దు చేయాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 115ను రద్దు చేసి, తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్పకు వినతి పత్రం అందజేశారు.

జీఓ 85ను రద్దు చేయాలి

కుందుర్పి, సెప్టెంబరు 11 : ప్రభుత్వం వెంటనే జీఓ 85ను రద్దు చేయాలని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పీహెచ్‌సీలో వైద్యాధికారి అనూషదేవి తదితరులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. రూరల్ పరిధిలో 30 శాతం ఉన్న వైద్య కోటాను జీఓ 85 ద్వారా ప్రభుత్వం 15 శాతానికి తగ్గించడం బాధాకరమన్నారు. వైద్యులు చాంద్ బేగం, నారాయణ స్వామి సోమశేఖర్, దళితులు పాల్గొన్నారు.

కురుబ సంఘం కార్యవర్గం ఎన్నిక

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 11 : కురుబ సంఘం నియోజకవర్గ కార్యవర్గాన్ని బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు కామక్కపల్లి నాగరాజు ఆధ్వర్యంలో సమావేశమై ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పరమేష్, నాగరాజు, బీరేష్, ప్రధాన కార్యదర్శిగా జయచంద్ర, కార్యద ర్శులుగా మనోజ్, నాగేంద్ర, తిప్పేస్వామి, రవి, ప్రచార కార్యదర్శులుగా వసంత కుమార్, సహాయ ప్రచార కార్యదర్శిగా హేమంత్, మహేష్, విశ్వనాథ్ మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షుడిగా హనుమంతు, కార్యదర్శిగా చంద్రమోహన్, యువజన గౌరవాధ్యక్షుడిగా సందీప్, గౌరవాధ్యక్షులుగా ఐపార్సపల్లి పాతలింగప్ప, పోలేపల్లి సోమశేఖర్‌ను ఎన్నుకున్నట్లు కార్యవర్గం సభ్యులు తెలిపారు

పౌష్టికాహార మాసోత్సవాలు



కణేకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కణేకల్లు, సెప్టెంబరు 11: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందించి చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐసీడీఎస్ సూ పర్ వైజర్ రమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 10, 11, 14, 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణలత, సునీత, అఫ్రోజ్, మారుతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జ్వరమని వస్తే సిబ్బంది ఎవరూలేరు..!

● యాడికి ఆసుపత్రిలో రోగుల ఆవేదన





తలుపులు వేసి ఉన్న డాక్టర్ గది, ఇంజక్షన్ వేసే గది

యాడికి, సెప్టెంబరు 11: జ్వరంతో బాధపడుతూ వైద్యం కోసం వస్తే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది ఎవరూ లేరని రోగులు వాపోయారు. ఇలా అయితే పేదలకు వైద్యం అందేది ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాడికి ప్రభుత్వ వైద్యశాలకు బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో పలువురు రోగులు వచ్చారు. హాస్పిటల్‌లోని డాక్టర్లు ఉండేగది, ఇంజక్షన్లు వేసే గది తదితర గదులన్నీ మూసి వేసి సిబ్బంది ఎక్కడికో వెళ్లిపోయారు. హాస్పిటల్‌లో సిబ్బంది ఎవరూ లేరు. చికిత్స కోసం వస్తే ఇంత పెద్ద హాస్పిటల్‌లో ఆరోగ్య సిబ్బంది ఒక్కరూ లేకుండా వెళ్లిపోవడం ఏంటని రోగులు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా అత్యవసరమని ఇక్కడకు వస్తే దిక్కెవరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా వచ్చి ఆసుపత్రిలో వస్తువులు ఎత్తుకెళ్లినా దిక్కులేదంటున్నారు. దీనిపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయడానికి రోగులు ఫోన్ చేయగా స్పందన లేదు. ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టి ఆసుపత్రిలో సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పిల్లాడికి జ్వరం వస్తే వచ్చా

మా అబ్బాయి అఖిల్‌కు జ్వరం వస్తోంది. చూపించుకోవడానికి యాడికి ఆసుపత్రికి వస్తే ఇక్కడ ఆరోగ్య సిబ్బంది ఒక్కరూ లేరు. దాదాపు గంటకు పైగా ఇక్కడే ఉన్నా. ఏం చేయాలో తెలియక వెనక్కి వెళ్లిపోతున్నాము. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాల్సిందే.

- మౌనిక, వెంగమనాయుడుకాలనీ, యాడికి



ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రోగులు

వరద బాధితులకు సాయం

200 మంది వలంటీర్లతో పంపిణీ చేయించిన ఎమ్మెల్యే అమిలినేని



వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 11: వరద బాధితులను ఆదుకునేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపుతో భారీగా విరాళాలు వచ్చాయి. కళ్యాణదుర్గం నుంచి విజయవాడకు మంగళవారం రాత్రి ఆరు లారీల్లో నిత్యావసర సరుకులను తరలించారు. వాటిని విజయవాడలో బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 200 మంది వలంటీర్లు, టీడీపీ నాయకులు దేవినేని ధర్మతేజ, కళ్యాణదుర్గం నాయకులు పంపిణీ చేశారు. మొత్తం 17 టన్నుల బియ్యం, కందిపప్పు, చక్కెర 80 టన్నులు, చింతపండు 20 టన్నులు, టమోటా 100 టన్నులు, కూరగాయాలు 80 టన్నులు, దుప్పట్లు, దుస్తులు, వంటనూనె, బిస్కెట్లతో పాటు మరికొన్ని నిత్యావసర సరుకులు తీసుకెళ్లి పంపిణీ చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా విరాళంగా వచ్చిన రూ. 15 లక్షల నగదును వరద బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గరుండి సరుకులను పంపిణీ చేయించారు. మరింత సాయం అందించేందుకు ముందుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

కుందుర్పి: విజయవాడ వరద బాధితుల కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్ఫూర్తితో తెలుగు తమ్ముళ్లు వెల్లువలా సాయం అందించారు. మండల పరిధిలోని జంబుగుంపల, కొలిమిపాలెం, అప్పాజీపాలెం, కెంచంపల్లి గ్రామాల నుంచి 21 క్వింటాళ్ల బియ్యం, రూ.45వేలకుపైగా నగదును బుధవారం సాయంత్రం కళ్యాణదుర్గం ప్రజావేదికలో అందజేశారు.

పామిడి : విజయవాడలోని వరద బాధితుల కోసం టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ రమేష్ నేతృత్వంలో తెలుగు తమ్ముళ్లు నిత్యవసర సరుకులు, దుస్తులను సేకరిస్తున్నారు. పట్టణంలోని పలువార్డులలో ఇంటింటికీ వెళ్లి బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, నాయకులు నల్లబోతుల శ్రీనివాసులు, బొమ్మా మోహన్‌కృష్ణ, సుంకప్ప, పత్రా శ్రీనివాసులు, శ్రీరాములు, టపాల్, షేక్షా, వెంకటరమణ, జగన్‌గౌడ్, రఫీ, హరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయుల దాడి





గాయపడిన దామోదర్, వీరనారప్ప

యల్లనూరు, సెప్టెంబరు11: మండలకేంద్రంలో బుధవారం ఉదయం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో టీడీపీ కార్యకర్తలు దామోదర్, వీరనారప్పకు తీవ్రగాయాలయ్యాయి. పాత కక్షల కారణంగా 20రోజులక్రితం పోలీసులు టీడీపీ, వైసీపీకి చెందిన రెండు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాలు వాగ్వాదం చేసుకున్నారు. ఈ సంఘటనను మనసులో పెట్టుకొని బుధవారం పొలం వద్దకు వెళ్లి వస్తున్న దామోదర్, వీరనారప్పపై వైసీపీకి చెందిన దాసరి రాముతోపాటు మరికొంతమంది దారి కాచి కర్రలు, ఇనుప రాడ్లతో దాడులు చేశారు. ఈ దాడుల్లో దామోదర్‌కు రక్తగాయాలు కాగా, వీరనారప్పకు తలకు, చేతులకు రక్త గాయాలయ్యాయి. వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని కూడా ధ్వంసం చేశారు. దానిని పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ ఇరువురిని పోలీసులు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. హుటాహుటీనా సీఐ సుబ్రహ్మణ్యం గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై 307కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ కేసులో శ్రీనివాసులుతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వైసీపీ నాయకుడి ఇంటిపై టీడీపీ వర్గీయుల దాడి

● కారు అద్దాలు ధ్వంసం



కారు అద్దాలు పగలగొట్టిన దృశ్యం

యాడికి, సెప్టెంబరు 11: మండలంలోని వెంగన్నపల్లిలో వైసీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఇంటిపై టీడీపీ వర్గీయులు దాడిచేశారు. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు కొంతమంది తన ఇంటిపై దాడికి వచ్చినట్లు భాస్కర్ రెడ్డి తెలిపారు. ఇంటివద్ద ఉన్న తన కారు అద్దాలను ధ్వంసం చేసినట్లు తెలి పారు. ఇంటివద్ద ఉన్న మోటార్లను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

'క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు'



ఖో-ఖో పోటీలో తలపడుతున్న విద్యార్థులు

ఉరవకొండ, సెప్టెంబరు11: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో ఈశ్వరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు బుధవారం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14, 17 బాలురు, బాలికల విభాగాల్లో యోగా, షటిల్, ఖో-ఖో వాలీబాల్, కబాడ్డీ, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంఈఓ-2 రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతి ప్ర సాద్, రాజేష్, చంద్ర, లలితాదేవి, కల్యాణి, ప్రవీణ్, నరసింహులు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గోవిందవాడలో 19, 20 తేదీల్లో క్రీడాపోటీలు

బొమ్మనహాళ్: మండలపరిధిలోని గోవిందవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 19, 20వ తేదీలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు ఈరన్న, మల్లికార్జున తెలిపారు. వారు బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాలతో క్రీడాపోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు పీఈటీ భోగేష్ మండల కో ఆర్డినేటర్‌గా ఉంటారని తెలిపారు. పీఈటీలు హలీమా, కృష్ణ, జనార్దన్, శివ, రాజేష్, ఆంజినేయులు, బొజ్జప్ప పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉరవకొండ,సెప్టెంబరు11: మండలంలోని బూదగవి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్, పీడీ ప్రవీణ్‌బాబు తెలిపారు. గత నెలల్లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల14,15వతేదీల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో జరిగే పోటీల్లో బాలికల విభాగంలో రమాదేవి, సౌమ్య, అంజుమ్, బాలుర విభాగంలో అజయ్, వినయ్, రాంచరణ్ పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.